క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



పిఠాపురంలో వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి శ్రీచక్రస్నానం కనుల వైకుంఠంగా జరిగింది. పండితులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఆలయ అర్చకులు పి.రామకృష్ణమాచార్యులు, పి.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో శ్రీచక్రస్నానం కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రన్ ఫర్ జీసస్‌లో భాగస్వాములుకండి



టీ షర్టులు, జెండాలను ఆవిష్కరిస్తున్న పురుషోత్తమ్‌దాస్ తదితరులు

పెద్దాపురం: ప్రతిష్టాత్మకంగా ఈ నెల 30వ తేదీన నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కార్యక్రమ కో–ఆర్డినేటర్ లంక పురుషోత్తమ్‌దాస్ పిలుపునిచ్చారు. రన్ ఫర్ జీసస్‌లో ధరించే టీ షర్టులు, టోపీలు, జెండాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్‌దాస్ మాట్లాడుతూ ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకూ రన్ ఫర్ జీసస్ ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీ ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని చెప్పారు. మండలంలోని క్రైస్తవులు ప్రతిఒక్కరూ హాజరై, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సీబీఐ సుకుమార్, జోషఫ్‌కుమార్, ఇమ్మానియేల్ సహాయం, చందూ స్టీఫెన్, పి.చిన్ని తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ జయంతి



లక్ష్మీదేవికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న పండితుడు

సామర్లకోట: అతిపురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి సమేత మాండవ్య నారాయణస్వామి ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో లక్ష్మీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం అమ్మవారు, స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. స్వామివారికి తులసీ దళాలతో పూజలు చేశారు. సాయంత్రం లక్ష్మీ జయంతి వేడుక, పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి గోదావరి కాలువపై ఉన్న కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, యార్లగడ్డవారి వీధి, మఠం సెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం కొనసాగింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలి మృతి



విమలకుమారి (ఫైల్)

పెద్దాపురం: లూథరన్ హైస్కూల్ విశ్రాంత ఉపాధ్యాయురాలు వేమూలూని రత్నకుమారి(66) సోమవారం కన్నుమూశారు. గత కొంతకాలం నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. హిందీ ఉపాధ్యాయురాలిగా ఎనలేని సేవలందించిన విమలకుమారి మృతికి హైస్కూల్ సిబ్బంది, సంఘ పెద్దలు, విశ్వాసులు, పుర పెద్దలు సంతాపం ప్రకటించారు.

కేసు కొట్టివేత

తుని: జీఎంఆర్ గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణం పబ్లిక్ హియిరింగ్ సమయంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నరసింహారావుపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేస్తూ తుని మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. కేసుకు సంబంధించిన వివరాలను న్యాయవాది ఏకే మల్లేశ్వరరావు తెలిపారు. 2017లో తొండంగి మండలంలో జీఎంఆర్ గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి పబ్లిక్ హియిరింగ్‌కు హాజరు కావడానికి వచ్చిన రైతు సంఘం నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడేళ్ల పాటు విచారణ జరిగిందని, ఇరు పక్షాల వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి కేసును కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చారని చెప్పారు.

మీ ఇంటి ఆడపడుచును గెలిపించండి

- కాకినాడ ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో ఎన్నికల ప్రచారం



పిఠాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత, పెండెం దొరబాబు తదితరులు



ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న వంగా గీత

పిఠాపురం: తనను మీ ఇంటి ఆడపడుచుగా భావించి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కోరారు. పిఠాపురంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ గండేపల్లి బాబీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి స్థానిక 8వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఆమెకు స్థానిక మహిళలు బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఇంటి వద్ద స్థానికులు హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు సాదర స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. ఏ అవసరం వచ్చినా మీకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. స్థానికులు ఎప్పుడైనా ఎక్కడైనా తమ సమస్యలను నా దృష్టికి తీసుకురావచ్చు అంటూ వారికి భరోసా కల్పించారు. మాకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా చెప్పుకునే అవకాశం మాకు మీ దగ్గర మాత్రమే ఉంటుందని, అందుకే మాకు మీరే ఎమ్మెల్యేగా కావాలి... సీఎం వైఎస్ జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ స్థానికులు ముక్తకంఠంతో చెప్పారు. వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటివరకూ తాను పిఠాపురానికి చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రజల ముందుకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేర్చుతున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, పిఠాపురం ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, అధికార ప్రతినిధి మల్లేశ్వరి, పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, 8వ వార్డు కౌన్సిలర్ బోనాసుల శివ, వైఎస్సార్ సీపీ నేతలు కొత్తపల్లి బుజ్జి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు, మైనార్టీ నాయకుడు మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు వివరాలు ఇవ్వొద్దు

పిఠాపురం: కొత్తఓట్లు నమోదు చేస్తామంటూ ల్యాప్‌టాప్‌లు పట్టుకుని కొందరు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతున్నారని, అటువంటి వారికి ఎటువంటి వివరాలు ఇవ్వవద్దని జేసీ, పిఠాపురం ఈఆర్‌ఓ రామసుందర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొన్ని రోజుల నుంచి కొందరు అపరిచిత వ్యక్తులు తిరుగుతూ కొత్త ఓట్లు నమోదు చేస్తామని, తప్పులు ఉంటే సరి చేస్తామంటూ నమ్మబలికి వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల కమిషన్ అటువంటి వారిని ఎవరినీ నియమించలేదని ఆయన తెలిపారు. పై విధంగా ఎవరైనా వివరాలు అడిగితే వెంటనే సమీప ఎన్నికల అధికారులకు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మానవ సేవే మాధవ సేవ

డాక్టర్ ఉమర్ ఆలీషా



పిఠాపురంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవ సేవే మాధవ సేవ అని, సమాజంలో ప్రతిఒక్కరూ తోటి వారికి సహాయం చేస్తూ అండగా నిలవాలని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మొహిద్దీన్ బాద్షా మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం పిఠాపురంలో పేదలకు బియ్యం, చీరలు పంపిణీ చేశారు. పట్టణంలోని సుమారు 130 మంది పేదలకు ఉమర్ ఆలీషా బియ్యం, చీరలు అందజేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకే కాకుండా పేదలందరికీ సహాయ సహకారాలు అందించడం వల్ల భగవంతుడి కృపకు పాత్రులవుతారని అన్నారు. కార్యక్రమంలో అహ్మద్ ఆలీషా, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో దవులూరి దొరబాబు

సామర్లకోట: పట్టణంలోని ఐదో వార్డు నుంచి పలువురు సోమవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. స్థానిక నాయకత్వాన్ని బలపర్చుతూ పలసులేటి చిన్నా, పుల్లయ్య, నీలం రామారావు ఆధ్వర్యంలో పలువురు పార్టీలోకి చేరారు. వీరికి స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద పార్టీ పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ దూది రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు గొరకపూడి చేరిక

భారతమాత సేవా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు, జై భారత్ జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరనున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లకు ఫోన్‌లో వివరాలు తెలిపారు. ప్రస్తుతం తాను విజయవాడలో ఉన్నానని చెప్పారు. పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబును గెలిపించడానికి తాను వైఎస్సార్ సీపీలోకి చేరతానని ఇప్పటికే హామీ ఇచ్చానన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. ఫాల్గుణ మాసం తెలుగు సంవత్సర చివరి మాసం ఆఖరి పౌర్ణమి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, పూజలను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి భక్తులు చెరకు రసం, పాలు, కోనేటిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేశారు. స్వామివారికి క్షీరాభిషేకం కూడా చేయించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వామివారికి పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు, ఉప ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను, ఉప ఆలయాల్లో ఉన్న దేవాతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లక్కి రాజ్‌గోపాల్, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన ట్రస్టు తరఫున అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

మధుర ఫలాలు వచ్చేశాయ్..!



రోడ్డు పక్కన అమ్మకానికి సిద్ధం చేసిన మామిడి పండ్లు

పిఠాపురం: వేసవి వచ్చిందంటే చాలు మధుర ఫలాలు మామిడి పండ్ల రుచి చూడాల్సిందే. చిన్న నుంచి పెద్దల వరకూ వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభమైంది. మార్కెట్‌లోకి మామిడి పండ్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం కొన్ని రకాలు మాత్రమే అందుబాటులోకి రాగా మరోవారం రోజుల్లో అన్ని రకాల మామిడి పండ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే తోటల వద్ద మామిడి పండ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ ఏడాది మామిడి పంట ఆశాజనకంగా ఉన్నా ఇటీవల కురిసిన వర్షాలకు తెగుళ్ల దాడి చేయడంతో దిగుబడిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు సైతం అధికంగానే ఉన్నాయి. మామిడి ప్రియులు మాత్రం ధరను లెక్క చేయకుండా కొనుగోలు చేస్తున్నారు.

వరి కోతలు ప్రారంభం

మండలంలో చురుగ్గా సాగుతున్న పనులు



సామర్లకోట మండలం పీబీ దేవంలో యంత్రం సాయంతో చేస్తున్న వరి కోతలు

సామర్లకోట: దాళ్వా వరి కోతలు మండల పరిధిలో ప్రారంభమయ్యాయి. మండలంలో 22,250 ఎకరాల్లో అన్నదాతలు వరి సాగు చేశారు. ఇందులో 18,500 ఎకరాల్లో గోదావరి కాలువ సాగునీటితోను, మిగిలిన పంట భూములు ఏలేరు కాలువ, బోర్ల సహయంతో చేపట్టారు. ప్రస్తుత దాళ్వాకు నీటి ఎద్దడి ఉంటుందని, రైతులు, అధికారులు ఆందోళన చెందారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా వరి పంట కోతకు వచ్చింది. ప్రస్తుతం మండలంలోని పీబీ దేవం, జి.మేడపాడు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమైనట్టు మండల వ్యవసాయాధికారి ఐ.సత్య తెలిపారు. ప్రస్తుత దాళ్వాలో 90 శాతం వరకు బొండాలు వేయడం వల్ల పంట ఆలస్యంగా వచ్చే అవకాశాలున్నాయని ఏఓ తెలిపారు. వీకే రాయపురం గ్రామంలో వరి నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల మరో నెల రోజుల వరకూ వరి పంట చేతికొచ్చే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. సన్న రకాలు 120 రోజులు, బొండాలకు 130 రోజులకు పంట కోతకు వస్తుందని ఏఓ సత్య తెలిపారు.

ఎకరానికి 60 బస్తాలు!

ప్రస్తుతం ఎకరానికి 50 నుంచి 60 బస్తాలకు వరకు దిగుబడి వస్తున్నట్టు ఏఓ సత్య చెప్పారు. గత సార్వాలో 45 నుంచి 48 బస్తాల దిగుబడి వచ్చిందన్నారు. సార్వాలో సాధారణంగా 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందని, గత సార్వాలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో దిగుబడి ఎక్కువగా వచ్చిందన్నారు. సార్వా కంటే దాళ్వా పంట దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. మండలంలో కేవలం ఐదు శాతం మాత్రమే కోతలు ప్రారంభమయ్యాయన్నారు. యంత్రాలతో వరి కోతలు జరుగుతున్నాయి.

వాహనాలను తనిఖీ చేసిన స్క్వాడ్



సామర్లకోట ఏడీబీ రోడ్డులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో 24 గంటలూ పని చేసేలా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో నగదును వెంట తీసుకు వెళ్లేవారు పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. పట్టణ, మండల పరిధిలోను ఏడీబీ రోడ్డులో వెళుతున్న వాహనాలను, నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న వాహనాలనూ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వివాహాలకు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లేవారు వెంట నగదు తీసుకు వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉండాలన్నారు. అనుమతి లేకుండా నగదు, మద్యం వాహనాల్లో ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ గ్రామాల్లో పర్యటించి ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



చేబ్రోలులో అయ్యప్పస్వామి చందనాభిషేకం

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలులో వేంచేసిన అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం 'ఉత్తర'ను పురస్కరించుకుని పండితులు తెల్లవారుజామున స్వామివారికి చందనాభిషేకం, జలాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్ప సేవా సంఘం సభ్యులు ఓరుగంటి నానాజీ, శీరం రమణ, బండారు అప్పారావు, ఓరుగంటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాడలో...

గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన అయ్యప్పస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరబాబు, దత్తు స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సైకిల్ యాత్ర చేసిన యువకులకు సత్కారం



అయోధ్యకు సైకిల్‌యాత్ర చేసిన యువకులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కోటనందూరు: మండలం నుంచి అయోధ్యకు సైకిల్ యాత్ర చేసిన యువకులను ఘనంగా సత్కరించారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని బొద్దవరానికి చెందిన బుద్దా రాజు, భీమవరపుకోటకు చెందిన నిట్టల శ్రవణ్‌కుమార్, దొడ్డి ప్రసన్నకుమార్ ఇటీవల 27 రోజుల పాటు 1800 కిలోమీటర్లు సైకిళ్లపై ప్రయాణం చేసి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామాలయాన్ని దర్శించారు. ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న ఈ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసి తిరిగి ఇంటికొచ్చిన యువకులను స్థానిక శివాలయంలో అల్లూరి సీతారామరాజు సేవాకమిటీ, శివాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక లలితాదేవి ఆలయంలో అన్న సమారాధన నిర్వహించారు.

శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల పంపిణీ



యువతకు సర్టిఫికెట్లు అందజేసిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు

పిఠాపురం: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు యువకులకు వృత్తి శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం ఆ సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 77 మందికి అరబిందో కేఎస్ఈజెడ్ జీఎం మంతా శ్రీనివాస్, వీరారెడ్డి, ఎ. శ్రీనివాస్ తదితరులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గ్రామీణులు పట్టణ యువతతో సమానంగా పోటీ పడి ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా నిపుణులైన సిబ్బందితో శిక్షణ ఇచ్చినట్లు కేఎస్ఈజెడ్ జీఎం మంతా శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో అగ్ని ప్రమాదం

పశువులపాక, ట్రాక్టర్, ఎడ్లబండి దగ్ధం



దగ్ధమైన పశువులపాకను పరిశీలిస్తున్న సర్పంచ్ మేరీఅవినాష్, తదితరులు

తుని రూరల్: మండలంలోని హంసవరంలో రైతు మజ్జూరు కొండకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుక్కు ట్రాక్టర్, ఎడ్లబండి, పశువుల పాక, గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు తుని అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్, మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, నాయకుడు రాయి దాసు, పాపారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధిత రైతును పరామర్శించి, ఓదార్చారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి బాధితుడిని ఆదుకుంటామని సర్పంచ్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

విభిన్న హోలీ



హోలీ జరుపుకొంటున్న విద్యార్థులు

పెద్దాపురం: పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో సోమవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ రాయవరపు సత్య విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులతో హోలీ పండగను ఘనంగా నిర్వహించారు. ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలు పంచుకున్నారు. హోలీ సంబరంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేవు.